సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



ఘనంగా సందల్ ఊరేగింపు

పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా సందల్ ఊరేగింపు ఆదివారం ఉదయం వైభవంగా కొనసాగింది. 8లో▸



గ్రామాలు గప్‌చుప్

గ్రామాల్లో గప్‌చుప్ వాతావరణం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావడమే ఇందుకు కారణం. 8లో▸



బీటీ రోడ్లు నిర్మించండి

గ్రామాల్లో బీటీ రోడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకున్న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ రీజియన్ పరిధిలో చేపట్టిన సేవా కార్యక్రమాల నిర్వహణకు గాను ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట పండింది. ఏటా రీజియన్ పరిధిలో అత్యుత్తమ సేవలు అందించే లయన్స్‌క్లబ్‌లకు అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశంలో రీజియన్ చైర్మన్ డా.శ్రీను లయన్స్‌క్లబ్‌లకు అవార్డులను అందించారు. 2024–25 సంవత్సరానికి గాను చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా మొత్తం వివిధ విభాగాల్లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 33 అవార్డులు దక్కించుకుంది. రీజియన్ పరిధిలో ఎక్సలెంట్ క్లబ్‌గా ఆమనగల్లు లయన్స్‌క్లబ్, అత్యుత్తమ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా మహేశ్, ఉత్తమ కోశాధికారిగా నర్సింహ, అత్యుత్తమ పీఆర్‌ఓగా పాష అవార్డులు అందుకున్నారు. అలాగే రక్తదాన శిబిరాలు, మెగా వైద్య శిబిరాలు, మధుమేహ పరీక్షల శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలకు గాను అవార్డులు దక్కాయి. ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డులు రావడానికి సహకరించిన లయన్స్‌క్లబ్ మల్టీపుల్ ఏరియా లీడర్ నరేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ చెన్నకిషన్‌రెడ్డి, మాజీ లయన్స్ గవర్నర్లు రమేశ్‌బాబు, రాధాకృష్ణ, రాంరెడ్డి తదితరులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

వృక్షార్చన జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించనున్న వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలోని తన నివాసంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతీ కార్యకర్త మూడు మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కతో దిగిన సెల్ఫీని 90003 65000 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. భూగోళాన్ని నివాసయోగ్యంగా మార్చాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవిందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందన్నారు. ఓసీలు రూ.200, ఇతరులు రూ.125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

ఎన్నికలు లేక.. నిధులు రాక!

అస్తవ్యస్తంగా పంచాయతీలు

- ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలనలోనే ..
- 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి ఆశించిన స్థాయిలో అందని నిధులు
- పార్కులు.. పారిశుద్ధ్య నిర్వహణ గాలికి
- వెలగని వీధిలైట్లు.. అంధకారంలో పల్లెలు
- ఎన్నికల నిర్వహణపై ఇప్పటికీ రాని స్పష్టత



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పంచాయతీ పాలక మండళ్ల గడువు ముగిసి ఏడాది దాటింది. 'స్థానిక' ఎన్నికల నిర్వహణపై ఇంకా స్పష్టత రాలేదు. పలు కారణాలతో ఎన్నికలు వాయిదా పడుతుండటంతో స్థానిక సంస్థల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు రాకుండా పోతున్నాయి. ఫలితంగా ఆయా పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేక అధికారులు రాకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్లు, డ్రైనేజీల్లో పూడిక తీత, పార్కుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పాలక మండళ్లు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలనే మార్గదర్శకాలు ఉండటంతో ఏడాది కాలంగా 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. సిబ్బంది వేతనాలకు మాత్రమే నిధులు విదుల్చుతుండటంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు, కొత్త వీధిలైట్లు, పార్కులు అభివృద్ధికి నోచుకోలేక పోతున్నాయి.

అందుబాటులో ఉండని అధికారులు

పాలకమండళ్ల రద్దయిన తర్వాత గత ఫిబ్రవరిలో ప్రభుత్వం మండల/జిల్లా స్థాయి అధికారులను పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. వారు మాతృశాఖ పనుల్లోనే బిజీగా ఉంటుండటం, అదనపు బాధ్యతలు భారంగా మారుతుండటంతో ప్రజలకు అందుబాటులో ఉండలేక పోతున్నారు. దీనికి తోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో మెజార్టీ ఇన్‌చార్జిలు కనీసం వారానికి ఒక రోజు కూడా ఆఫీసులో కన్పించడం లేదు. అక్రమ నిర్మాణాలు, వెంచర్లు భారీగా వెలుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం పూర్తి కాబోతుంది. ఆస్తిపన్ను వసూళ్లు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఇటు అంతర్గత వనరులు లేక, అటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు రాక పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి.

చిన్నచిన్న అవసరాలకూ పక్క చూపులే..

వీధి లైట్లు, రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, మోటార్ల రిపేర్లు, పార్కుల నిర్వహణ, శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టే చిన్నచిన్న మరమ్మతులకు కూడా ఎమ్మెల్యే, ఎంపీ నిధులపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో కనీసం పాడైన వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని దుస్థితి. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించే చర్యలకు నిధుల లేమి సమస్యగా మారింది. సర్పంచులు మాత్రమే కాదు ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. తాజాగా 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల పాలక మండళ్ల పదవీ కాలం సైతం ముగిసింది. ప్రస్తుతం ఆయా స్థానిక సంస్థలన్నీ ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడం, ఆశించిన నిధులు రాకపోవడం, వెరసి ఆర్థిక సంక్షోభానికి కారణమవుతోంది. నిజానికి కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నుంచి 2020–21 నుంచి 2023–24 వరకు రూ.367,71,43,428 నిధులు రాగా, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.227,90,89,197 నిధులు వచ్చాయి. గత ఏడాది నుంచి ఈ నిధులు కూడా రాకపోవడం, వివిధ రకాల కారణాలతో తరచూ ఎన్నికలను వాయిదా వేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి.

జీతం సరిగా వస్తలేదు



నెలనెలా జీతం వస్తుందనే ఆశతో పనిచేస్తున్నా. మూడు నాలుగు నెలల కోసారి ఇస్తున్నారు. జీతం అందక, ఇల్లు గడవక అప్పు చేయాల్సి వస్తోంది. రోజుఏదో ఒకచోట పూడికతీత, చెత్త తొలగింపు వంటి పనిచేస్తూనే ఉంటాం. అధికారులు స్పందించి వేతనం సరిగా అందేలా చూడాలి.

– గడ్డమీది లక్ష్మయ్య, జీపీ కార్మికుడు, తాళ్లపల్లి, షాబాద్ మండలం

అప్పులు తెచ్చి పనులు



గతంలో చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలయ్యాం. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక పోవడంతో కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు నిధులు లేక, అభివృద్ధి పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడం దారుణం.

– చందిప్ప జంగయ్య, మాజీ సర్పంచ్, మల్లారెడ్డిగూడ, షాబాద్



రైతుదీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

'స్థానిక' పోరులో గుణపాఠం తప్పదు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- రైతు దీక్షను జయప్రదం చేయాలి
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 18న ఆమనగల్లులో నిర్వహించే రైతుదీక్షకు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో రైతుదీక్ష వేదిక ఏర్పాట్లను ఆదివారం ఆయన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. అనంతరం లక్ష్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు అధికారం కోసం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ పూర్తిగా జరగలేదని, రైతుభరోసా అందలేదని అన్నారు. మహిళలకు నెలనెలా రూ.2,500 ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేటీఆర్ దీక్షకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివచ్చి జయపరదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కన్వీనర్ పత్యానాయక్, మాజీ ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, మాజీ సర్పంచ్‌లు శ్రీనునాయక్, జ్యోతయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో హెచ్-సిటీ పనులు వేగిరం



శేరిలింగంపల్లిలో ప్రతిపాదిత హెచ్-సిటీ పనులను పరిశీలిస్తున్న ఇలంబర్తి తదితరులు

గచ్చిబౌలి: హెచ్– సిటీ పనుల వేగవంతానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ఆదివారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో చేపడుతున్న హెచ్–సిటీలో ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణతో పాటు జంక్షన్ల విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జంక్షన్ల వద్ద స్థల సేకరణ వేగవంతంగా చేపట్టాలన్నారు. సంబంధిత విభాగాల అధికారులు బస్సులో ప్రయాణించి యుటిలిటీ విద్యుత్, వాటర్ వర్క్స్, టెలిఫోన్ వైర్లను వెంటనే తొలగించాలని సూచించారు. ఖాజాగూడ, సైబరాబాద్ కమిషనరేట్, గచ్చిబౌలి, ట్రిపుల్ ఐటీ, విప్రో జంక్షన్లు, డీఎల్‌ఎఫ్ రోడ్డు, మసీద్ బండ, చందానగర్ రైల్వే స్టేషన్, లింగంపల్లి ఆర్‌ఓబీ, శ్రీదేవి టాకీస్, గంగారం రోడ్డు, ఆల్విన్ క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాలలో హెచ్‌సిటీలో ప్రతిపాదిత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలక శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, చీఫ్ ఇంజినీర్ భాస్కర్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు శేఖర్, పాండ్యన్, వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, టీజీఎస్‌ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

వన మహోత్సవానికి కార్యాచరణ



బ్యాగుల్లో విత్తనాలు నాటుతున్న కూలీలు

- నర్సరీల్లో మొక్కల పెంపకం
- ఉపాధి కూలీలతో పనులు
- వర్షాకాలం ప్రారంభమైన వెంటనే నాటేలా ఏర్పాట్లు
- ప్రత్యేకంగా దృష్టి సారించిన అధికారులు

షాద్‌నగర్: పుడమి తల్లిని మరింత పచ్చగా మార్చేందుకు.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం వన మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పదివేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో నర్సరీల్లో బ్యాగుల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం వంటి పనులు చేపడుతున్నారు.

వేడిని తట్టుకునేందుకు..

నర్సరీల్లో పెంచే ప్రతీ మొక్కను బతికించుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేసవి కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండకు ఎండిపోకుండా గ్రీన్‌నెట్.. వాటి కింద మొక్కలను పెంచుతున్నారు. వర్షాకాలం ప్రారంభం అయిన వెంటనే గుంతలు తీసి నాటేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది.

నీడ నిచ్చే మొక్కలకు ప్రాధాన్యత

నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. నీడనిచ్చే కానుగ, రావి, మర్రి, చింత చెట్లతో పాటు ఈత, తాటి, ఇంటి ఆవరణలో పెంచేందుకు దానిమ్మ, నిమ్మ, సీతాఫలం, తులసి, నేరేడు, లిల్లీ, మందారం, పారిజాతం, గులాబీ, గన్నేరు, మందారం, కరివేపాకు, బొప్పాయి, మునగ, జామ మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఆయా గ్రామాలకు నర్సరీల నుంచి పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అవసరమైన మొక్కలు సిద్ధం



వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అవసరమైన మొక్కలు నర్సరీల్లో సిద్ధం చేస్తున్నాం. నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నాం.

– అరుణ, ఏపీఓ, ఫరూఖ్‌నగర్



అప్పటి ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



ఆటపాటల్లో పూర్వ విద్యార్థినులు

సర్కార్ బడి.. జ్ఞాపకాల జడి

- ప్రభుత్వ పాఠశాలలో 50 ఏళ్ల సంబరం
- అంగరంగ వైభవంగా స్వర్ణోత్సవాలు
- సందడి చేసిన అప్పటి విద్యార్థులు
- చేవెళ్ల పాఠశాలలో అ'పూర్వ' ఘట్టం

చేవెళ్ల: వారంతా సర్కార్ బడిలో ఓనమాలు దిద్దారు.. అంచలంచెలుగా ఎదిగి జీవితంలో స్థిరపడ్డారు.. 50 ఏళ్ల కాలంలో కలిసి చదువుకున్న వారంతా ఒక్కచోట చేరారు.. జ్ఞాపకాల జడిలో తడిసి ముద్దయ్యారు.. వయసును మరిచి, హోదాలను పక్కన పెట్టి ఆటపాటలతో సందడి చేశారు.. ఈ అ'పూర్వ' ఘట్టానికి చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. ఈ పాఠశాలలో 1955 నుంచి 2005 వరకు 50 ఏళ్ల కాలంలో కలిసి చదువుకున్న వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవాలను సంబరంగా జరుపుకొన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.

అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి..

వేడుకలకు 1955 నుంచి 1980 వరకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. వారిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసిన వారిని సైతం సత్కరించారు. చాలాకాలం తర్వాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ వేడుక తమ జీవితంలో ఒక జ్ఞాపకంగా గుర్తుండిపోతుందని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఈ పాఠశాల అభివృద్ధికి కలిసి కృషి చేస్తామని ప్రకటించారు. ఆరు నెలలుగా 1981–82 బ్యాచ్ విద్యార్థులు చేసిన కృషితో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఇలాంటి వేడుక ఎప్పుడూ చూడలేదని పూర్వ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆ నాడు తాము చదువులు చెప్పిన విత్తనాల్లాంటి విద్యార్థులు నేడు మహావృక్షాలుగా ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థి శ్రీనివాస్‌గౌడ్ తన ఆర్కెస్ట్రా బృందంతో ఆలపించిన పాటలు అలరించాయి. వేడుకకు సహకారం అందించిన దాతలు కృష్ణారెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు బుగ్గారెడ్డి, మల్లయ్యగౌడ్, ఖుర్షీద్ అలీ, నర్సింలు, గాంధీ, పద్మ, సులోచన, భానుమతి, నిర్వాహకులు ఆర్.శ్రీనివాస్, బురాన్ ప్రభాకర్, గోపాలచారి, షఫీ, వెంకట్‌రెడ్డి, మాణిక్యం, పెంటయ్య, ఖాజాపాషా, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా కలిస్తే బాగుంటుందనే..



చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని 1981–82 బ్యాచ్ పూర్వ విద్యార్థులం అంతా అనుకున్నాం.. పాఠశాలలో చదివిన అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు కలిస్తే బాగుంటుందని, పాఠశాల అభివృద్ధికి మరింత తోడవుతుందని ఆలోచన వచ్చింది. దీనికి 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుక కూడా కుదిరింది. ఆరు నెలలుగా పూర్వ విద్యార్థులను అందరినీ కలుస్తూ గ్రూప్ క్రియేట్ చేసి ఏకం చేసేందుకు కృషి చేశాం. పూర్వ విద్యార్థులంతా వేడుకలకు హాజరుకావడం.. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ప్రకటించడం మరింత సంతోషాన్ని నింపింది.

– ఆర్. శ్రీనివాస్‌గుప్తా, పూర్వ విద్యార్థి

ఎప్పుడూ లేని సంతోషం



ఈ వేడుక ఒక పూర్వ విద్యార్థిగా ఎప్పుడూ లేని సంతోషాన్ని కలిగించింది. మనం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలనే ఆలోచనలోంచి వచ్చిందే ఈ స్వర్ణోత్సవ వేడుక. మాకు చదువు చెప్పిన గురువులను మేము గౌరవిస్తుంటే.. మేము చదువు చెప్పిన విద్యార్థులు సైతం ఈ వేడుకల్లో పాల్గొని వారి అనుభవాలను పంచుకున్నారు. ఇది మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది. పాఠశాల ప్రారంభించి 70 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి చదువుకున్న విద్యార్థులు వేడుకలకు హాజరుకావడం బాగుంది.

– బురాన్ ప్రభాకర్, 1982–83 బ్యాచ్ విద్యార్థి

యువతకు స్ఫూర్తినిచ్చేలా..



పూర్వ విద్యార్థుల సమ్మేళనం యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంది. ఈ పాఠశాలలో చదివిన మాకు ఇన్నేళ్ల చరిత్ర, ఇంత మంది ఉన్నారనే విషయం ఇక్కడ కలిసే వరకు తెలియదు. 50ఏళ్ల నాటి పూర్వ విద్యార్థులను ఒకచోట కలిసేలా ఏకం చేసిన నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు. పాఠశాల అభివృద్ధికి అంతా కలిసి కృషి చేయాలనే ఆలోచన అద్భుతం. మాకు పాఠాలు చెప్పిన గురువులు, వారి గురువులను గౌరవించే వేడుకలో పాల్గొనం ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్ తరానికి ఆదర్శంగా నిలిచేలా ఈ వేడుక మిగులుతుంది.

– ఎ.అనంత్‌రెడ్డి, 2002–03 బ్యాచ్ విద్యార్థి

ఆర్టీసీలో ఐ టిమ్స్

- వచ్చే నెల నుంచి అమలుకు చర్యలు
- గ్రేటర్‌లో సుమారు 6,500 ఐ టిమ్స్ వినియోగం
- టికెట్ కొనుగోళ్లకు డిజిటల్ చెల్లింపులు



సాక్షి, సిటీబ్యూరో: సిటీబస్సుల్లో డిజిటల్ చెల్లింపులను అమలులోకి తేనున్నారు. ఈ మేరకు అన్ని బస్సుల్లో త్వరలో ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్స్ (ఐటిమ్స్)ను ప్రవేశపెట్టనున్నారు. ప్రయాణికులు ప్రస్తుతం సిటీ బస్సుల్లో పయనించేందుకు టికెట్ కొనుగోళ్ల కోసం నగదు చెల్లించాల్సి వస్తోంది. దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లో డిజిటల్ కరెన్సీ నిత్యకృత్యంగా మారిన ప్రస్తుత తరుణంలో ఈ నగదు చెల్లింపుతో ప్రయాణికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో చిల్లర సమస్య కూడా తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఫోన్‌పే, గూగుల్‌పే తదితర సదుపాయాలను వినియోగించుకుని టికెట్లు తీసుకొనే సదుపాయాన్ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం బస్‌పాస్‌ల కౌంటర్లలో మాత్రం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో బస్సులతో పాటు టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు, అధీకృత టికెట్ బుకింగ్ ఏజెన్సీల్లోనూ డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించాలని ఆర్టీసీ భావిస్తోంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 28 డిపోల్లో వినియోగించేందుకు సుమారు 6500 ఐ టిమ్స్‌ను కొనుగోలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఐటిమ్స్ పరీక్షలు తుది దశలో ఉన్నాయని, కొద్దిపాటి మార్పుల అనంతరం మార్చి నుంచి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

ఆటోమేటిక్‌గా చెల్లింపులు..

ఐటిమ్స్‌లో ఉన్న సాంకేతిక వ్యవస్థల ఆధారంగా ఎప్పటికప్పుడు లొకేషన్ నిర్ధారణ అవుతుంది. ప్రయాణికులు కోరిన చోటికి వెళ్లేందుకు అయ్యే చార్జీని కూడా ఈ లొకేషన్ ప్రకారం సిద్ధంగా ఉంచుతారు. ప్రయాణికులు బస్సెక్కిన వెంటనే రానున్న లొకేషన్‌కు అనుగుణంగా టిక్కెట్ ఇష్యూ అవుతుంది. ఆ మేరకు ఫోన్ పే లేదా గూగుల్ పే చేస్తే చాలు. ప్రస్తుతం నగరంలోని సుమారు 1,150 రూట్లలో నిత్యం సుమారు 2800 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 22 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. సుమారు 14 లక్షల మంది మహిళా ప్రయాణికులు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుని ఉచిత ప్రయాణం చేస్తున్నారు.

అడవిలో మంటలార్పిన హెడ్‌కానిస్టేబుల్



కర్రకు బట్ట కట్టి మంటలు ఆర్పుతున్న బాల్‌రాజ్‌యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: పోలీసంటే ఉద్యోగమే కాదు సామాజిక బాధ్యతని నిరూపించాడో హెడ్‌కానిస్టేబుల్. అడవిలో మంటలు ఎగిసిపడుతుండగా కర్రకు బట్ట కట్టి అదుపు చేసి శభాష్ అనిపించుకున్నాడు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కనే ఉన్న చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో అటువైపు వెళ్తున్న పెట్రోలింగ్ మొబైల్ ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బాల్‌రాజ్‌యాదవ్ గమనించాడు. వెంటనే కారు దిగి పెద్ద కర్రకు బట్టను కట్టి వ్యాప్తి చెందకుండా అడ్డుకున్నాడు. అతనితో పాటు ఉన్న రామకృష్ణ అనే డ్రైవర్ ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేసి రప్పించాడు. అరగంట పాటు బాల్‌రాజ్‌యాదవ్ శ్రమించిన తీరును స్థానికులు మెచ్చుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు.

విభజించు.. మోసగించు!

- సైబర్ నేరగాళ్ల కొత్తపంథా
- వర్గాల వారీగా గుర్తించి వల
- ఏమరపాటుగా ఉంటే ఖాతాలు ఖాళీ

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజల్లో అవగాహన వచ్చేలోగా.. వారు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు బ్యాంకు వివరాల అప్డేట్, క్రెడిట్ కార్డు, వర్క్ ఫ్రమ్ హోమ్ పేర్లతో వల వేసేవారు. ఇప్పుడు రూటు మార్చి వ్యక్తులు, వారి వయస్సుల ఆధారంగా దోచేస్తున్నారు. వృద్ధులైతే కరెంటు, నల్లా బిల్లులు కట్టలేదంటూ.. మహిళలు, గృహిణులకు తక్కువ ధరతో గృహోపకరణాలు, యువకులైతే క్రిప్టో కరెన్సీ పెట్టుబడులకు లాభాలంటూ వల విసిరి నిండా ముంచుతున్నారు.

డేటాతోనే అసలు గుట్టంతా..

సైబర్ నేరాలకు మూలం ప్రజల వ్యక్తిగత వివరాలు అంగట్లో సరకులా మారడమే. ప్రజల డేటా విభజించుకుని దాని ఆధారంగా మోసాలు చేస్తున్నారు. వీటికితోడు గూగుల్లో తప్పుడు ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్లు భారీగా పుట్టుకొస్తున్నాయి. ఏ అంశంపై సెర్చ్ చేసినా దానికి సంబంధించిన ప్రకటనలు తెరపైకి వస్తుంటాయి. ప్రత్యేక సందర్భాల్లో కొన్ని సంస్థలకు వ్యక్తిగత వివరాలు అందిస్తుంటాం. ఇవన్నీ నేరగాళ్లకు చేరుతున్నాయి. ఇవే వివరాలతో మోసగాళ్లు ఫోన్‌లో సంప్రదించి డబ్బు కొల్లగొడుతున్నారు.



మోసాల్లో వీరే ఎక్కువ..

ఇటీవలి కాలంలో నగరంలో డ్రగ్స్ పార్సిల్ వచ్చిందంటూ కస్టమ్స్, సీబీఐ, ఎన్సీబీ అధికారులమంటూ ఫోన్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ తరహా మోసాలపై ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే ఈ ఏడాది దాదాపు 200 వరకు ఫిర్యాదులు అందాయి. బాధితుల్లో యువతే ఎక్కువ. తక్కువ ధరకు గృహోపకరణాలు, ఇంట్లో ఉంటూ ఉద్యోగం తదితర మోసాల బాధితుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. కస్టమర్ కేర్, క్రిప్టో కరెన్సీ, పెట్టుబడికి రెండింతల లాభాలు, లోన్ యాప్ మోసాల్లో 20 40 ఏళ్ల లోపు వారు అధికం. సైబర్ మోసాల బారిన పడితే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీకి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



ప్రవళిక (ఫైల్)

కీసర: ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీసర దాయరలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి కీసర దాయరకు చెందిన ప్రవళిక(23) నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఆమె తల్లిదండ్రులతో పాటు, సోదరుడు బయటికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ప్రవళిక ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

గ్రామాలు గప్‌చుప్



యాచారం మండల పరిషత్ కార్యాలయం

స్థానిక సంస్థల ఎన్నికలు లేక ఆశావహుల ఆవేదన

- ఇప్పటికే ప్రజల మద్దతుకు రూ.లక్షలు ఖర్చు
- ప్రస్తుతం జనాల్లో తిరగకుండా పోటీదారుల పాట్లు

యాచారం: గ్రామాల్లో అంతా గప్‌చుప్ వాతావరణం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి సిద్ధమైన ఆశావహులు నేడు ప్రజల మధ్యన కనిపించని పరిస్థితి ఉంది. దీనికి ప్రధాన కారణం ఎన్నికల ప్రక్రియ ఆలస్యమవ్వడమే. స్థానిక సంస్థల పోరుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చకచక పూర్తి చేయడం, త్వరగా ఎన్నికలు ఉంటాయనే సాంకేతాలతో గ్రామాల్లో ఆశావహుల హడావుడి మొదలైంది. రిజర్వేషన్లు కలిసొస్తే సర్పంచ్ లేదా ఎంపీటీసీగా పోటీ చేసి గెలుస్తామనే ధీమాతో పోటీదారులు గ్రామాల్లో హంగామా సృష్టించారు. ప్రజలను మచ్చిక చేసుకోవడం కోసం పిలువకున్నా వాళ్ల ఇళ్లకు వెళ్లి బాగున్నావా పెద్దమ్మ... పెద్దనాన్న... తమ్ముడు ఏం చేస్తున్నాడు.. చెల్లెలు ఇంటికొస్తుందా అంటూ ఆత్మీయ పలకరింపులు చేశారు. కొందరైతే గ్రామాల నుంచి ఉద్యోగ, వ్యాపార రీత్యా నగరంలో ఉన్న వాళ్లను కలిసి మద్దతు కూడగట్టుకోవడమే కాక, ఫోన్లు చేసి అన్నా.. ముందు అడుగుతున్నా.. నాకే నీ మద్దతు కావాలి.. అంటూ కాళ్ల బేరమాడారు.

సిద్ధం చేసుకున్న ఆర్థిక వనరులు

రాత్రి, పగలు ప్రజలకు సేవ చేసినా.. ఆపదకు ఆదుకున్నా సరే.. ఎన్నికలప్పుడు ప్రజలకు పచ్చనోటు ఇవ్వనిదే ఓట్లు రాలవనే భావన నేతల్లో ఉంటుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయనే ఆశతో గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి సిద్ధమైన ఆశావహులు కావాల్సిన డబ్బును సిద్ధం చేసి పెట్టుకున్నారు. యాచారం మండలంలోనే చూసుకుంటే 24 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీలు ఉన్నాయి. మొత్తం 50,975 ఓటర్లు ఉన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన మాల్, యాచారం, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, గునుగల్, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి, చింతుల్ల, చింతపట్ల, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, కుర్మిద్ద తదితర గ్రామాల్లో పోటీలో ఉండటానికి రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలకు పైగానే సిద్ధం చేసుకున్నట్లు వినికిడి. ఎస్సీ, బీసీ రిజర్వేషన్లు వస్తే రూ.50 లక్షల్లోపు ఖర్చు, జనరల్ అయితే మాత్రం రూ.కోటి వరకు ఖర్చు చేసేందుకు ముందుకొస్తున్నారు. ఆశావహులంతా వ్యవసాయ భూములు, ప్లాట్లను తక్కువ ధరలకు అమ్మి కొందరు డబ్బులు జమ చేసుకోగా, మరికొందరైతే రూ.5కు చొప్పున వడ్డీకి డబ్బులు మాట్లాడుకుని తమ వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్లు చేశారు. ఎన్నికలు కోడ్ వస్తే డబ్బులు పోగు చేసుకోవడం కష్టంగా మారుతుందని గ్రామాల్లోని తెలిసినవాళ్ల వద్ద డబ్బులు దాచి పెట్టుకున్నారు.

ఎన్నికల లేవని ఆందోళన

స్థానిక సంస్థల ఎన్నికలు కులగణన తర్వాతే ఉంటాయనే సాంకేతాలతో ఆశావహులు లబోదిబోమంటున్నారు. 'ఎన్నికల కోసమే అప్పులు చేశాం.. వ్యవసాయ భూములు, ప్లాట్లు అమ్మినాం.. రిజిస్ట్రేషన్లు చేసి రూ.5కు వడ్డీకి అప్పులు తెచ్చి పెట్టుకున్నాం' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాపోటీలు, మహిళలకు చీరలు, దేవాలయాల నిర్మాణాలకు చందాలు, నిత్యం ఓ కాలనీలో విందులు, యాత్ర పర్యటనల కోసం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పేరుతో రూ.లక్షలాది ఖర్చు చేశారు. పార్టీల వారీగా కూడా పెద్ద నేతలను మచ్చిక చేసుకోవడం కోసం నిత్యం దావత్‌లు ఇచ్చారు. నిప్పుల మీద నీళ్లు పోసినట్లుగా సర్కార్ ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు లేవని సాంకేతాలతో ఇన్నాళ్లు ప్రజలకు దావత్‌లు ఇచ్చిన ఆశావహులంతా కొద్ది రోజులుగా కనిపించకుండా తిరుగుతున్నారు.

ఆర్టీసీ బస్సులో నగదు చోరీ

వెంగళరావునగర్: ఆర్టీసీ బస్సులో నగదు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్ ప్రాంతానికి చెందిన పి.అరుణ, శివప్రసాద్ దంపతులు శనివారం ప్లాట్ కొనుగోలు చేసేందుకు నగదు తీసుకుని ఆర్టీసీ అమీర్‌పేటకు బస్సులో వచ్చారు. అమీర్‌పేటలోని రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద బ్యాగ్‌లో చూసుకోగా అందులో ఉన్న రూ.1.40 లక్షలు నగదు కనిపించలేదు. దీంతో బస్సులో నగదు చోరీకి గురైనట్లుగా భావించినా వారు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4 లక్షల విలువైన మత్తు పదార్థాల పట్టివేత

ముగ్గురి అరెస్ట్

ఉప్పల్: గంజాయి, డ్రగ్స్ విక్రయ కేంద్రంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 4 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన జగదీశ్ రెడ్డి, కడప ప్రాంతానికి చెందిన అక్బన్ హుస్సేన్, కర్నూలు జిల్లాకు చెందిన అజయ్ కుమార్ చిలుకానగర్ శ్రీనివాస్ హైట్స్ సమీప కాలనీలో ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్ బృందం వారి స్థావరంపై దాడి చేసి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 53 గ్రాముల ఓజికుష్, 1.24 కేజీల గంజాయి, విదేశీ మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్సై చంద్ర, వెంకట్, రవి, శ్రీను, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లు నిర్మించండి



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

మంచాల: గ్రామాల్లో బీటీ రోడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చెన్నారెడ్డిగూడలో పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 15 ఏళ్ల అధికారంలో ఉండి చెన్నారెడ్డిగూడ, బండలేమూరు, అజ్జినతండా గ్రామల్లో సీపీఎం బలంగా ఉందని వివక్ష చూపి రోడ్డు నిర్మించకుండా కాలం వెళ్లదీశారని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ గ్రామాలకు రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పి చెన్నారెడ్డిగూడలో శిలాఫలకం వేసి దాదాపు సంవత్సరం అవుతున్నా ఇప్పటికీ చలనం లేదన్నారు. ఈ గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ప్రభుత్వానికి కనీసం ఎన్నికల హామీలను అమలు చేసే పరిస్థితి లేదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చెన్నారెడ్డిగూడ, బండలేమూరు, అజ్జినతండా గ్రామాలను ఏకం చేసి పోరు చేస్తామన్నారు. నూతన రోడ్లు సాధించేవరకు అధికారులు, నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గసభ్యుడు స్వామి, నాయకులు పాండు, చంద్రయ్య, మోతిలాల్, సురేష్, వెంకటేష్, ప్రహ్లాద్, కృష్ణ, ప్రవీణ్, జంగయ్య, పరమేశ్, భిక్షపతి, ఇబ్రహీం, ,లచ్చిరాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో టోకరా

- స్నాప్ చాట్‌లో పరిచయం
- ఆమె పేరుతో రుణం
- కారు, బైక్ కొనుగోలు
- నిందితుడిపై కేసు నమోదు

అమీర్‌పేట: స్నాప్ చాట్ ద్వారా పరిచయమైన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఓ యువకుడు ఆమె పేరిట రుణం తీసుకుని తప్పించుకొని తిరుగుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువతికి కూకట్‌పల్లి సమీపంలోని గోపాల్‌నగర్‌కు చెందిన ధీరజ్‌రెడ్డి (26)తో స్నాప్ చాట్ ద్వారా పరిచయం ఏర్పడింది. నీవు నాకు నచ్చావని, ఇంట్లో పెద్దవారితో చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అనంతరం సదరు యువతి పేరున ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణాలు తీసుకున్నాడు.అలాగే కారు, స్కూటీతో పాటు ఐపాడ్ ఇంటి వస్తువులు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత గత నవంబర్ నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితురాలు ఇటీవల ధీరజ్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని అతడి తల్లిదండ్రులకు చెప్పింది. సానుకూలంగా స్పందించినట్లు నటించిన వారు అప్పటికి ఆమెకు నచ్చజెప్పి పంపారు. మర్నాడు ఆమె వారికి ఫోన్ చేయగా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి బాల్కనీలో గంజాయి మొక్క సాగు



ఉప్పల్ ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

బంజారాహిల్స్: ఇంటి బాల్కనీలో గంజాయి మొక్క పెంచుతున్న ఆటోడ్రైవర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ వెంకటగిరి బేగ్ రెసిడెన్సీలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ మహమ్మద్ అర్షద్ అలీ తన ఇంటి బాల్కనీలో గంజాయి మొక్క పెంచుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆదివారం దాడి చేసిన పోలీసులు కుండీలో పెంచుతున్న గంజాయి మొక్కను గుర్తించారు. కొన్ని నెలలుగా దీనిని పెంచుతున్నట్లు నిందితుడు అంగీకరించడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నైజీరియన్ డిపోర్టేషన్

ఎఫ్ఆర్ఆర్ఓ సహకారంతో పంపిన హెచ్–న్యూ

సాక్షి, సిటీబ్యూరో: వీసా గడువు ముగిసినా నగరంలోనే అక్రమంగా నివసిస్తున్న నైజీరియన్ ఇకేచుకు సిల్వెస్టర్ మాంబా హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అతడి దేశానికి డిపోర్టేషన్ విధానంలో బలవంతంగా తిప్పి పంపింది. ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఆదివారం ప్రకటించారు. ఇకేచుకు సిల్వెస్టర్ 2012లో బిజినెస్ వీసాపై ముంబై వచ్చాడు. తొలినాళ్లల్లో వస్త్ర వ్యాపారం చేపట్టిన అతను... ముంబైలో తక్కువ ధరకు వస్త్రాలు కొనుగోలు చేసి తన దేశానికి ఎగుమతి చేసేవాడు. పాస్‌పోర్టు గడువు ముగిసినా రెన్యువల్ చేయించుకోకుండా అక్కడే ఉండిపోయాడు. దీంతో ముంబైలోని తలోజా పోలీసులు 2019లో ఇతడిని పట్టుకుని పాస్‌పోర్టు యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అప్పట్లో రెండేళ్ల జైల్లో జైల్లో ఉన్న ఇతగాడు బయటకు వచ్చిన తర్వాత నవీ ముంబైలోని ఉల్వేలో ఉన్న స్నేహితుడి ఇంటికి మకాం మార్చాడు. డ్రగ్స్ దందాలో ఉన్న అతడితో కలిసి ఇతనూ పెడ్లర్‌గా మారాడు. ఇందులో భాగంగా నగరానికి చేరుకున్న ఇకేచుకు సిల్వెస్టర్ హుమాయున్‌నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతూ ఈ నెల 5న హెచ్–న్యూకు చిక్కాడు. విచారణ నేపథ్యంలో వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని డిటెన్షన్ సెంటర్‌కు తరలించిన హెచ్–న్యూ అధికారులు డిపోర్టేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ జీఎస్ డేనియేల్, ఎస్సై వెంకట రాములు తమ బృందాలతో ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎట్టకేలకు ఎఫ్ఆర్ఆర్ఓ నుంచి ఉత్తర్వులు పొంది నైజీరియాకు డిపోర్టేషన్ చేశారు. ఇటీవల కాలంలో అనేక మంది విదేశీయులు మెడికల్, స్టూడెంట్, బిజినెస్ వీసాలపై వచ్చి ఇక్కడే తిష్ట వేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి వారిలో అనేక మంది డ్రగ్స్ దందాలోకి దిగుతున్నారని, వీరిపై సమాచారం తెలిస్తే 8712661601కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

5.5 కిలోల గంజాయి పట్టివేత

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న ఘటన ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అల్వాల్, వెంకటాపురానికి చెందిన అభిషేక్ కుమార్ సింగ్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. నిందితుడిని అదుపులలోకి తీసుకుని అతడి నుంచి 5.5 కేజీల గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



దర్గాకు పూలు, చాదర్ తీసుకొస్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి



పాల్గొన్న భక్తులు

ఘనంగా సందల్ ఊరేగింపు

పహాడీషరీఫ్ దర్గా వద్ద వేలాది భక్తజనం

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ బాబా షర్ఫొద్దీన్ దర్గా సందల్ ఊరేగింపు ఆదివారం ఉదయం వైభవంగా కొనసాగింది. 759వ ఉర్సు ఉత్సవాలలో భాగంగా బాలాపూర్‌లో బాబా అడుగిడిన నివాసం నుంచి శనివారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలనంతరం సందల్ ఊరేగింపు ప్రారంభమయ్యింది. కొత్తపేట, వెంకటాపూర్, షాహిన్‌నగర్, జల్‌పల్లి కమాన్‌ల మీదుగా ఉదయం 9 గంటలకు పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంది. అనంతరం గంధంను కొండపై ఉన్న షర్ఫొద్దీన్ బాబా సమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. వేలాది మంది పాల్గొంటున్న ఊరేగింపు కావడంతో పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు అదనపు బలగాలతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మహేశ్వరం డీసీపీ సునితా రెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్‌ల ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ పాల్గొని ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి తలపై పూలు, చాదర్‌తో వెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు యూసుఫ్ ఖాద్రీ, కొండల్‌యాదవ్, యాదగిరి, దస్తగిర్, అబ్దుల్లాబిన్ అవద్, శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.



గుర్రంతో విన్యాసాలు